క్లుప్తంగా

రక్షణ గోడ కోసం వినతి



మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చాందినికి వినతిపత్రం అందజేస్తున్న తిప్పలవలస గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని తీర ప్రాంత గ్రామమైన తిప్పలవలసకు రక్షణ గోడ నిర్మించాలని ఆ గ్రామానికి చెందిన పలువురు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చాందినికి మంగళవారం వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిప్పలవలస గ్రామం సముద్రాన్ని ఆనుకొని వుండటంతో తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ఇబ్బందులు పడుతున్నామన్నారు. తిప్పలవలసకు జెట్టీ నిర్మించాలని, వలలు, పడవలు రాయితీపై మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు జి.జమరాజు, మూగి శ్రీను, రాయితి బుచ్చోడు, వాసుపల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి వితరణ



క్రీడా సామగ్రిని అందజేస్తున్న దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజ్‌మెంట్ సురేష్

భోగాపురం: మండలంలోని తూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు దివీస్ కంపెనీ యాజమాన్యం సుమారు రూ.2.25 లక్షల విలువ చేసే సాఫ్ట్‌బాల్ క్రీడా సామగ్రిని వితరణగా మంగళవారం అందజేసింది. ఈ సందర్భంగా దివీస్ కంపెనీ సీఎస్ఆర్ మేనేజ్‌మెంట్ సురేష్ మాట్లాడుతూ క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోను రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం వి.అప్పన్న, పీడీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేతన ఒప్పందం జీఓ విడుదల చేయాలి

నెల్లిమర్ల: ఆశా వర్కర్లకు వేతన ఒప్పందం జీఓ వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు వేతన ఒప్పందం జీఓ విడుదల చేయాలని, కోల్‌కత్తా ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో జరజాపుపేట హెల్త్ సెంటర్ వైద్యాధికారికి ఆశా వర్కర్లు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.పద్మ, ఆర్.రాధ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష సహాయం



ట్రస్టుబోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత సతీష్

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణానికి అమెరికాలో నివాసం ఉంటున్న పట్టణానికి చెందిన పక్కి వెంకటేశ్వరరావు కుమారుడు సతీష్, అర్చన దంపతులు రూ.1,01,000 సహాయం చేశారు. స్థానిక విజయా కాలనీలోని తన నివాసంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు మంగళవారం నగదు అందజేశారు. ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ విష్ణు, ఎస్.వి.జి.శ్రీను, దాసరి రవి పాల్గొన్నారు.

యువత రక్తదానం చేయాలి



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీఓ శాంతి

చీపురుపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆర్డీఓ బి.శాంతి కోరారు. స్థానిక ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నేతృత్వంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆర్డీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అపోహలు వీడి ఆరోగ్యంగా ఉన్న యువకులు ప్రతీ ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలన్నారు. శిబిరంలో రక్తదానం చేసిన కళాశాలకు చెందిన 29 మంది విద్యార్థులను ఆమె అభినందించారు. రెడ్‌క్రాస్ సంస్థ డివిజన్ కో–ఆర్డినేటర్ బి.వి. గోవిందరాజులు, వనిత క్లబ్ అధ్యక్షురాలు వి.సంతోషి, కళాశాల కరస్పాండెంట్ ఆదినారాయణ, గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పూసపాటిరేగ: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సెక్టార్ సీడీపీఓ ఎస్తేరురాణి



విజయనగరం ఫోర్ట్: కార్యక్రమంలో మాట్లాడుతున్న అనురాధ

పూసపాటిరేగ: విద్యార్థులు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ సీడీపీఓ ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని కోనాడ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జాతీయ పోషకాహార మాసోత్సవాలలో భాగంగా మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యానికి పోషణ అవసరాన్ని తెలియ చెప్పడం, పోషక పదార్థాలు లోపం వలన శారీరక పెరుగుదల అభివృద్ధిపై చూపే ప్రభావం, కలిగే ఆర్థిక భారం, చివరిగా దేశ అభివృద్ధికి పోషణకు ఉన్న సంబంధంపై అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశం అన్నారు. పౌష్టికాహార లోపం, రక్త హీనత, తక్కువ బరువుతో పిల్లలు జన్మించడం, పిల్లలకు సరిగా ఎదుగుదల లేకపోవడం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరంలో...

విజయనగరం ఫోర్ట్: ఆరు నెలలు నిండిన ప్రతి బిడ్డకు అదనపు పౌష్టికాహారం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ బి.అనురాధ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం 5వ సెక్టార్ పరిధిలో ఉన్న అయ్యన్నపేట, ఎస్సీ కాలనీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పౌష్టికాహారాన్ని ద్రవరూపంలోగాని, గుజ్జు రూపంలోగాని ఇవ్వాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించాలన్నారు.

వాసవీ క్లబ్ వారోత్సవాలు ప్రారంభం



ఓల్డేజ్ హోమ్‌లో వృద్ధులకు అల్పాహారం వడ్డిస్తున్న క్లబ్ సభ్యులు

విజయనగరం: సెప్టెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ చైర్‌పర్సన్ సిహెచ్.మురళీకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా కుసుమహారనాధ్ వాసవీ ఓల్డేజ్ హోమ్‌లోని వృద్ధులకు మంగళవారం అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టబోతున్నట్లు చెప్పారు. ప్రకృతి పరిరక్షణ కోరుతూ మొక్కలు నాటడం, నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు, సమాజంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే జర్నలిస్టులను సన్మానించడం, పేదలకు నిత్యావసర వస్తువుల పంపిణీ మొదలగు కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్టు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు చెన్నా బుచ్చి జనార్ధనరావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయ కుమార్, కేబినెట్ సెక్రెటరీ గుంపిన నారాయణ రావు, రీజియన్ సెక్రెటరీ సముద్రాల నాగరాజు, ఓల్డేజ్ హోమ్ నిర్వాహకులు వంకాయల దాలయ్యశెట్టి, మామిడిపాక జగన్నాధరాజు తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న చదురుగుడి పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంపైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్ తదితరులు అమ్మవారికి విశిష్ట కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వనంగుడిలో శాంతిహోమం



శాంతిహోమాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద నున్న పైడితల్లి అమ్మవారి వనంగుడిలో మంగళవారం సర్వమానవాళి శ్రేయస్సుకు శాంతి హోమం నిర్వహించారు. ఆలయ వేదపండితులు తాతా రాజేష్, దూసి శివప్రసాద్ తదితరులు హోమాన్ని చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థిస్తూ ప్రత్యేక యాగాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేత్రదానంతో జీవితాల్లో వెలుగులు



మోపాడలో నేత్రదానంపై అవగాహన ర్యాలీ

- జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.రాణి

డెంకాడ: నేత్రదానం చేయడం వలన ఎంతో మంది చూపులేని వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయని జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కె.రాణి, మోపాడ పీహెచ్‌సీ డాక్టర్ పీవీ యెగితాబాల అన్నారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆప్తాల్మిక్ అధికారి ఎం.గణపతిరావు ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది నేత్రదాన అవగాహన ర్యాలీని మోపాడలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నేత్రదానం ఒక సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరూ భావించాలన్నారు. మరణానంతరం ఒక వ్యక్తి చేసే నేత్రదానంతో ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగునిస్తుందన్నారు. నేత్రదానంపై ప్రజలకు అపోహలు పాలద్రోలాలన్న ఉద్దేశంతో పని చేస్తున్నామని తెలిపారు. స్త్రీ, పురుషులు వయోభేదం లేకుండా నేత్రాలు దానం చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సిహెచ్ సత్యనారాయణ, ఎస్.సూరిబాబు, గున్నమ్మ, రహమతుణ్ణిషా, రమణమ్మ, మహేశ్వరి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్లు సోకకుండా చూసుకోండి

రేగిడి: పంటలకు తెగుళ్లు సోకకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని అంబకండి, ఉంగరాడ, వన్నలి తదితర గ్రామాల్లోని వరి పంటకు ఆకుముడత తెగులు సోకడాన్ని ఆయన మంగళవారం గమనించి, నివారణకు పలు సూచనలు చేశారు. ఈ తెగులు నుంచి పంటను రక్షించడానికి 200 లీటర్ల నీటిలో 400 మిల్లీలీటర్ల క్లోరో పైరిఫాస్ మందును కలిపి ఎకరాకు 10 ట్యాంకుల చొప్పున పిచికారీ చేయాలని తెలిపారు. నత్రజని ఎరువులు ఎక్కువగా వినియోగించిన కారణంగా పంటకు ఈ తెగులు సోకుతోందన్నారు. అన్నదాతలు అప్రమత్తంగా ఉండి, పంటలు సంరక్షించుకోవాలన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సంతకవిటి: అంతర్జాతీయ భాగవత ఆణిముత్యాలు వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన భాగవత పద్యధారణ పోటీల్లో బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. విద్యార్థులు కొణపల దిల్లేశ్వరరావు(ఎనిమిదో తరగతి), నడగాన ధనలక్ష్మి(ఏడో తరగతి), కొణపల లోహిత్‌కుమార్(ఆరో తరగతి)లు ఆ పోటీలో పాల్గొని, వారు చెప్పమన్న పద్యాలను చూడకుండా ధారణ(అప్పజెప్పారు) చేశారు. ఆ సంస్థ తరపున ఒక్కో విద్యార్థికి రూ.1116 బహుమతిగా అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



తెర్లాం: నెమలాంలో వైద్య శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారులు మనోజ్ఞ, శ్రీనివాసరావు



రేగిడి: గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారి అసిరినాయుడు

తెర్లాం: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మండలంలోని పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు మనోజ్ఞ, శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని నెమలాం గ్రామంలో వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతూ శిబిరానికి హాజరైన వారికి సదరు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రతిరోజూ కాచివడపోసిన నీటిని తాగాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎటువంటి అనారోగ్య పరిస్థితులు తలెత్తినా గ్రామంలో ఉన్న హెల్త్ క్లినిక్‌కు వెళ్లి, వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం నిర్వహించి, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆరుబయట పదార్థాలు తినకూడదని, కొంచెం వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలన్నారు. కాచివడపోసిన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు, సూపర్‌వైజర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని రేగిడి, ఆమదాలవలస, వన్నలి, సోమరాజుపేట తదితర గ్రామాల్లో రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సీహెచ్ అసిరినాయుడు మంగళవారం పర్యటించి, ఇంటింటా ఫీవర్ సర్వే చేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి, వెంటనే వారు ఆస్పత్రికి వెళ్లేలా చూడాలన్నారు. అలాగే గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించి, వ్యాధి బారినపడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రాజాం: మండలంలోని ఆగూరు, కంచరాం, దోసరి తదితర గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు మంగళవారం సందర్శించారు. తొలుత రికార్డులు పరిశీలించి, అక్కడి పారిశుధ్య పరిస్థితులపై ఆరాతీశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ పర్యటన

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని కోరాడ, పాకీ, స్వామి వారి వీధుల్లో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి మంగళవారం పర్యటించారు. ప్రతీ వీధి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులను ముమ్మరం చేయాలని సిబ్బందికి ఆమె సూచించారు. మురుగుకాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై పశువులు కడుతున్న వారికి నోటీసులు ఇవ్వాలన్నారు. ఆమె వెంట టౌన్ ప్లానింగ్ అధికారి, తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



అవగాహన ర్యాలీలో ఎంపీడీవో శ్యామలాకుమారి, తదితరులు

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎంపీడీవో శ్యామలాకుమారి అన్నారు. మండలంలోని రెడ్డిపేట గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, సంరక్షించాలని కోరారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా తగ్గిన అడవుల శాతం కారణంగా ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని, భవిష్యత్ తరాలు బాగుండాలంటే మనమంతా పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఎస్.హరనాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నూకాలమ్మ, శశికళ, అమ్మనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స



వాకర్ సహాయంతో నడుస్తున్న వరహాలమ్మ

నెల్లిమర్ల: మిమ్స్ ఆస్పత్రిలో ఓ వ్యక్తికి మెడ దగ్గర వెన్నెముకకు అరుదైన శస్త్ర చికిత్స మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే... కె.వరహాలమ్మ(70) అనే మహిళ తన ఇంటి వద్ద ఇటీవల పడిపోవటం వల్ల మెడ దగ్గర వెన్ను ఎముక విరిగిపోయింది. ఈ ప్రమాదంలో బాధితురాలికి సీ1, సీ2, ట్రౌమాటిక్ సబ్లక్షేషన్ విత్‌కోర్డ్ కంప్రెషన్ కారణంగా మెడనొప్పి, రెండుకాళ్లు చేతులు చచ్చుపడిపోయి వీల్‌చైర్‌లో మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మిమ్స్ స్పైన్ సర్జరీ విభాగం వైద్యులు (న్యూరోసర్జరీ, ఆర్థోపెడిక్), ఎనస్థీసియా వైద్యులు ఆధ్వర్యంలో అతి క్లిష్టమైన, అరుదైన సీ1, సీ2, డి కంప్రెషన్, పోస్టీరియర్ ఫిక్సేషన్ శస్త్ర చికిత్స చేసి వెన్నును సరి చేశారు. ప్రస్తుతం బాధితురాలు వాకర్ సహాయంతో నడుస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇటువంటి శస్త్ర చికిత్స మొదటిసారిగా మిమ్స్ ఆస్పత్రిలో జరిగింది. ఈ ఆపరేషన్ సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎనస్థీసియా బృందం సహకారంతో డాక్టర్ సావంత్, డాక్టర్ ఈశ్వరరావు, డాక్టర్ టి.యశ్వంత్ తదితర వైద్య బృందం చేశారు.

సాగర కవచంతో రక్షణ : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

భోగాపురం: సముద్ర మార్గం గుండా వచ్చే ఉగ్రవాదులు, చొరబాటుదార్లను నిలువరించేందుకు సాగర కవచం కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని డీఎస్పీ ఆర్.గోవిందరావు అన్నారు. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న సాగర కవచం మాక్‌డ్రిల్‌పై మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలోని 970 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉందన్నారు. గతంలో గుర్తు తెలియని వ్యక్తులు సముద్రమార్గం గుండా మనదేశంలోకి ప్రవేశించడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. ఈ నేపథ్యంలో చొరబాటుదారులను నిలువరించేందుకు ప్రత్యేక నిఘా పెడుతున్నట్టు చెప్పారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు రెండు మండలాల్లోని 21 మత్స్యకార గ్రామాల్లో ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఐలు వైకుంఠరావు, ఎన్.వి.ప్రభాకర్, ఎనిమిది మంది ఎస్ఐలు, 199 మంది సిబ్బంది పాల్గొన్నారు.

పందుల నియంత్రణకు చర్యలు



పందుల పెంపకందారులతో సమావేశం నిర్వహిస్తున్న డాక్టర్ సాంబమూర్తి

విజయనగరం: నగరంలోని పందుల సంచారాన్ని ఈ నెలాఖరుకల్లా నిరోధించేందుకు కృషి చేస్తామని కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి వెల్లడించారు. కమిషనర్ పి.నల్లనయ్య ఆదేశాల మేరకు నగరంలోని పాలస్పత్రి మస్టర్ పాయింట్ వద్ద పందుల పెంపకందారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని పందుల సంచారం విచ్చలవిడిగా ఉందని, దీన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. పందుల సంచారం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలుగుతుందని స్పష్టం చేశారు. తక్షణమే పందుల పెంపకందారులు పందులను కార్పొరేషన్ పరిధి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించుకోవాలని ఆదేశించారు. లేని పక్షంలో సదరు పెంపకందారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రామారావు, రామకృష్ణ, సలీం రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



కె.ఎల్.పురం యూపీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశాలు

విజయనగరం ఫోర్ట్: కోల్‌కత్తాలోని వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆశా వర్కర్ల సంఘం నాయకులు మహాలక్ష్మి, పద్మ డిమాండ్ చేశారు. వైద్యులు, సిబ్బందికి రక్షణ కల్పించాలని కోరుతూ వారు నగరంలోని లంకాపట్నం, కేఎల్‌పురం, సంతపేట, ఫూల్‌బాగ్, రాజీవ్‌నగర్ కాలనీ, వీటీ అగ్రహారం, రాకోడు పీహెచ్‌సీల వద్ద నల్ల రిబ్బన్లతో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. పని ప్రదేశాల్లో మహిళల పట్ల లైంగిక వేధింపులు లేకుండా నిరోధక కమిటీలు వేయాలన్నారు. అనంతరం వైద్యులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి, అప్పయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సురక్షితమైన తాగునీరు అందించండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శంకరరావు

బొబ్బిలి: పట్టణ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలని సీపీఎం జిల్లా నాయకుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయం ఆవరణలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం పట్టణవాసులకు వీధి కుళాయిల ద్వారా మున్సిపల్ అధికారులు అందిస్తున్న తాగునీటి స్వచ్ఛతపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. ఏళ్ల తరబడి రక్షిత మంచినీటి పథకాల ట్యాంకుల్లో పరిశుభ్రతా చర్యలు చేపట్టకుండా, ఒక్క క్లోరినేషన్ చేసి, సరఫరా చేసినంత మాత్రాన అది మంచినీరేనని ఎలా అనుకోవాలని ప్రశ్నించారు. షెడ్యూల్ ప్రకారం రక్షిత మంచినీటి పథకాలను శుభ్రం చేయాల్సి ఉన్నా చాలా ఏళ్లుగా అది సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. ఇంటిపన్ను, నీటిపన్నులను ముక్కు పిండిమరీ వసూలు చేస్తున్నారే తప్ప పట్టణవాసుల ఆరోగ్యాన్ని అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. పట్టణంలో పారిశుధ్య కార్మికుల కొరత కారణంగా అపారిశుధ్యం పెరిగి, వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. మున్సిపాలిటీలో సరిపడ పారిశుధ్య సిబ్బంది ఉండి, తద్వారా పట్టణం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. ఆయన వెంట జి.గౌరి, బి.వెంకట్, శివ, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.